# 70

# గొప్ప ఆజ్ఞ

## (28:16-20)

యేసు తన శిష్యులకు ఇచ్చిన గొప్ప ఆజ్ఞ, వారు సమస్త జనులను శిష్యులనుగా చేయవలెనను ఒక పిలుపు జారీచేయబడుటతో మత్తయి వ్రాసిన సువార్త ముగియుచున్నది. పునరుత్థానుడైన యేసు తన అపొస్తలులకు యెరూషలేములో ఒలీవల కొండపై అగుపించిన వివరమును లేక ఆయన పరలోకమునకు ఆరోహణుడై వెళ్లుట గూర్చిన విషయమును మత్తయి చేర్చలేదు. ఆయన దృష్టి ప్రపంచ సౌవార్తీకరణముపై – యూదులు మరియు అన్యజనులు సహితము రక్షింపబడుటపై – కేంద్రీకృతమై యుండినది.

### సన్నివేశము (28:16, 17)

**16పదనొకండుమంది శిష్యులు యేసు తమకు నిర్ణయించిన గలిలయలోని కొండకు వెళ్లిరి. 17వారు ఆయనను చూచి ఆయనకు మ్రొక్కిరిగాని, కొందరు సందేహించిరి.**

**వచనము 16.** "కాని" (NASB) అను సముచ్చయము (*de*), యేసు సజీవుడై యున్నాడను సత్యమునకును యూదుల నాయకులు మరియు సైనికుల చేత వ్యాపింపజేయబడిన ముందటి అబద్ధ నివేదికకును గల తారతమ్యమును చూపించుచున్నది. యేసు పునరుత్థానుడయ్యాడని వారు విశ్వసించినప్పుడు అపొస్తలుల మనస్సుల్లో ఎంతో గొప్ప ఆనందము మరియు ఆశ్చర్యము మిళితమైపోవుటయేగాక అది వారి దు: ఖమును రూపుమాపి యుండవచ్చును కదా! తరువాత ఏమి జరుగునో ఎరుగక, దేవదూత మరియు యేసు స్త్రీల చేత తెలియనంపిన ఆదేశములకు వారు విధేయతతో లోబడిరి (28:7, 10). **పదనొకండు మంది** – వారిలో ఇప్పుడు ఇస్కరియోతు యూదా లేదు (27:5) – **గలిలయకు** వెళ్లారు, ఆయన వారికి ముందుగా తెలియజెప్పినట్టే అచ్చట యేసు వారి కొరకు వేచియుండును. వారు యింకా తెలిసికొనలేదు, కానీ ఆయన నిమిత్తము వారు చేయవలసిన పనులు త్వరలో ప్రారంభం కానుండినవి.

అపొస్తలులు **యేసు తమకు నిర్ణయించిన కొండకు** చేరుకొన్నారు. వారు ఏ కొండకు చేరుకొనవలెనో యేసు వారికి తన మరణమునకు ముందు ఇచ్చిన ఆదేశములలో నిర్దిష్టముగా తెలియజెప్పియుండును (26:32). అలాగే, ఆయన స్త్రీలతో చెప్పి పంపినప్పుడు కూడ శిష్యులు అది ఏ కొండనో చెప్పియుండును (28:10). మత్తయి వ్రాసిన సువార్తలో, కొండలు మరియు పర్వతములు దేవుని ప్రత్యక్షతలు మరియు సంభాషణల స్థలములై యుండినవి (5:1; 14:23; 15:29; 17:1; 21:1). ఈ కొండపై, యేసు అపొస్తలులకు తన గొప్ప ఆజ్ఞ నిచ్చాడు.

**వచనము 17.** శిష్యులు యేసును చూచినప్పుడు, స్త్రీలు చేసిన విధంగానే (28:9),

**వారు ఆయనకు మ్రొక్కిరి**; కానీ అచ్చట కూడుకొని యుండిన **కొందరు సందేహించిరి** (*distazō*). ఆర్. టి. ఫ్రాన్స్, సందేహించుచుండిన వారి గూర్చి మరొక దృక్పథముతో, ఇచ్చట ప్రయోగింపబడిన క్రియా పదమును నొక్కివక్కాణించాడు: "సందేహించిరి" అను క్రియా పదము నిశ్చతమైన అపనమ్మకమును సూచించుట లేదు, కానీ అనిశ్చయతను మరియు సంకోచమును సూచించుచున్నది (14:31తో పోల్చి చూడు, క్రొత్త నిబంధనలో ఈ పదము మరొకసారి ప్రయోగింపబడిన సందర్భము ఇదొక్కటే.)[1] వారు పునరుత్థానుడైన యేసును చూచారని స్త్రీలు చెప్పిన సాక్ష్యమును నమ్ముటలో అపొస్తలులు కొంచెము మందకొడిగా నుండిరి (లూకా 24:11). కాబట్టి ఆయన తన హస్తములను మరియు పాదములను వారికి చూపించుట ద్వారాను, వారి కళ్ల యెదుటనే రాల్చిన చేపను తినుట ద్వారాను ఆయన నిజముగా పునరుత్థానుడయ్యాడనుటకు వారు స్పృశించదగ్గ నిదర్శనమును యేసు వారి యెదుట ప్రదర్శించాడు (లూకా 24:39–43; యోహాను 20:24–29 చూడు). నిశ్చయముగా, సందేహించినవారు పునరుత్థానడైన యేసును చూచుటకు తరుణము లభించని గలిలయ వాస్తవ్యులై యుండిరి.

## యేసు ఇచ్చిన గొప్ప ఆజ్ఞ
## (28:18–20)

యేసు, ప్రజలకు "వారి శాస్త్రుల వలె గాక అధికారముగలవాని వలె బోధించెను" (7:29). ఒక పక్షవాయువుగల వానిని స్వస్థపర్చుట ద్వారా పాపములు క్షమించుటకు ఆయనకు గల అధికారమును ప్రదర్శించాడు (9:2–8). ఆయన ఇహలోకములో ఉన్నప్పుడు కలిగియుండిన అధికారము - ఉపదేశించుటకు, స్వస్థపర్చుటకు, మరియు పాపములను క్షమించుటకు - తండ్రి చేత ఆయనకియ్యబడినది (11:27; 21:23–27 చూడు). "అపవిత్రాత్మలను వెళ్లగొట్టుటకును, ప్రతివిధమైన రోగమును స్వస్థపరచుటకును, వారికి అధికారమిచ్చి" యేసు తన పన్నెండు మంది శిష్యులను పరిమితమైన నియమాకముపై పంపాడు (10:1). మరొక పర్యాయము, ఆయన వారిని పంపించుచున్నాడు; కానీ ఈ సారి వారిని సర్వ లోకమునకును, సంపూర్ణమైన రక్షణ సందేశముతోను పంపించుచున్నాడు.

### "సర్వాధికారము" (28:18)

**18అయితే యేసు వారియొద్దకు వచ్చి–పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది.**

**వచనము 18. పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నదని.** యేసు ప్రకటించాడు. తండ్రి ఆయనకు మహోన్నతమైన అధికారమిచ్చాడని ఆయన చెప్పిన మాటల అర్థమై యున్నది. క్రైస్తవ యుగమునకు ప్రభువై యుండుటకు ఆయన తన తండ్రి చేత ఏర్పరచుకొనబడి యున్నాడు. "అందుచేతను ... దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెనని" పౌలు అటుతరువాత చెప్పాడు (ఫిలిప్పీయులకు 2:9–11). ఈ రోజుల్లో మతపరముగా చేయవలసియున్న సమస్తమును "ఆయన నామములో" లేక ఆయన అధికారము క్రింద

చేయబడవలెను. యేసు పునరుత్థానుడు కాక మునుపు విషయము ఇలా లేదు (యోహాను 15:16; 16:23–26), కానీ మానవ చరిత్రలోని ఈ చివరి యుగములో పరిస్థితి మునుపటిలాగే ఉన్నది (లూకా 24:46, 47; అపొస్తలుల కార్యములు 2:38; 4:12; కొలొస్సయులకు 3:17). యేసు అత్యధికముగా హెచ్చింపబడి, దేవుని కుడిపార్శ్వమునకు ఆరోహణుడయ్యాడు (22:44; 26:64; అపొస్తలుల కార్యములు 2:34–36; ఫిలిప్పీయులకు 2:9–11). ఆయన సింహాసనాసీనుడై తన రాజ్యమును పరిపాలించుచున్నాడు (1 కొరింథీయులకు 15:24–28); ఆయన తన సంఘమునకు శిరస్సై యున్నాడు (ఎఫెసీయులకు 1:20–23; కొలొస్సయులకు 1:18).

### సమస్త జనులను శిష్యులనుగా చేయుడి (28:19)

**19కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు ...**

**వచనము 19.** సర్వాధికారము కలిగియుండి, **కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి** అని యేసు తన శిష్యులతో చెప్పాడు. “వెళ్లుడి” అని అనువదింపబడిన గ్రీకు అసమాపక క్రియా పదము “మీరు వెళ్లుచుండగా” అనియు, “మీరు వెళ్లచున్నారు కాబట్టి” అనియు అనువదింపబడవచ్చును. ఏది ఏమైనా, ఒక అసమాపక క్రియా పదము ఒక విధివాచకమునకు చేర్చబడినప్పుడు – “శిష్యులనుగా చేయుడి” అను ఇట్టి సందర్భములో వలె – అది విధివాచకము యొక్క ఉద్ఘాటనా బలమును పంచుకొనుచున్నది.[2] మోర్రిస్ దీనిని ఇలా చెప్పుచున్నాడు: “ఉద్ఘాటన, శిష్యులనుగా చేయుటపై ఉన్నప్పటికిని, వారు వెళ్లలెననియు, ప్రజలను శిష్యులనుగా చేయవలెననియు యేసు ఆయనను వెంబడించుచుండిన వారికి ఆజ్ఞాపించుచుండెను.”[3]

“శిష్యులనుగా చేయుడి” (*mathēteuō*) అనగా, ప్రజలకు ఉపదేశించుచు వారు క్రీస్తును వెంబడించుచున్నవారై యుండునట్లు వారిని నడిపించుట యని అర్థము. శిష్యత్వము వ్యక్తిగతముగా యేసునందు విశ్వసించుట మాత్రమే కాదు, కానీ ఆయన నైతిక ప్రమాణములను మనలను మనము వశము చేసికొనుటకు ఇష్టపడుటతో ముడిపడి యున్నది.

యేసు **సమస్త జనులను** అను తన దర్శనమును తన అపొస్తలులకు అబ్బజేసాడు. పరిమితమైన నియమాకములో, అపొస్తలులు “ఇశ్రాయేలు వంశములోని నశించిన గొఱ్ఱెల యొద్దకు మాత్రమే వెళ్లవలసినదని” అదేశింపబడిరి; వారు “అన్యజనుల దారిలోనికి వెళ్లకూడదనియు,” లేదా “సమరయుల యే పట్టణములోనైనను ప్రవేశింపకూడదనియు” నిర్బంధింపబడిరి (10:5, 6). అయితే ఇప్పుడు జారీ చేయబడుచుండిన గొప్ప ఆజ్ఞలో, సువార్త సర్వ సృష్టికి ప్రకటింపబడవలసినదై యుండినది (మార్కు 16:15).

“జనులు” అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*ethnos* నుండి) తరుచుగా “అన్యజనులు” అని అనువదింపబడినది (4:15; 6:32; 10:5, 18; 12:18, 21) – అనగా, ఇశ్రాయేలీయులకు భిన్నమైనవారని అర్థము. ఈ సందర్భములో, ఈ పదము ఇశ్రాయేలీయులను కూడ కలుపుకొనుచున్నది. గొప్ప ఆజ్ఞకు సంబంధించిన మరొక

వృత్తాంతములో, లూకా సువార్తలో వ్రాయబడియున్న దానిలో, "*యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో* ఆయన పేరట మారుమనస్సు మరియు పాపక్షమాపణము ప్రకటింపబడవలెనని" యేసు సెలవిచ్చాడు (లూకా 24:47). సువార్త మొదట యెరూషలేములోని యూదులకు (అపొస్తలుల కార్యములు 1–7) అటుతరువాత, యూదయ, సమరయలో (అపొస్తలుల కార్యములు 8; 9), చివరకు సవిస్తరంగా రోమా సామ్రాజ్యమందంతట ప్రకటింపబడినది (అపొస్తలుల కార్యములు 10–28).

మత్తయి వ్రాసిన సువార్త యేసు క్రీస్తు వంశావళికి అబ్రాహాముతోగల సంబంధమును వ్యవస్థాపించుటతో మొదలయ్యింది (1:1, 2). ఇశ్రాయేలీయుల జనాంగము ఉనికిలోనికి రాకమునుపు, అతని సంతానము ద్వారా సమస్త జనములు ఆశీర్వదింపబడునని దేవుడు అబ్రాహామునకు వాగ్దానమిచ్చాడు (ఆదికాండము 12:3; 22:18). ఈ వాగ్దానము యేసు వైపు, సమస్త జనులకు రక్షణను సమకూర్చువాని వైపు చూచినది (గలతీయులకు 3:8, 16). పాత నిబంధన ప్రకారము, దేవుడు ఇశ్రాయేలీయులను తన స్వకీయ జనముగా ఏర్పరచుకొన్నాడు. ఏది ఏమైనా, క్రొత్త నిబంధన ప్రకారము, దేవుని ప్రజల గుర్తింపు "వంశముపై కాదు కానీ ఆయన మెస్సీయయైన వాని ద్వారా దేవునితో గల సంబంధముపై ఆధారపడి యున్నది (3:8–9; 8:11–12; 12:21; 21:28–32, 41–43; 22:8–10; 24:14, 31; 26:13 చూడు)."[4]

సమస్త జనులను శిష్యులనుగా చేయుటతోపాటు **వారికి బాప్తిస్మము** కూడ ఇవ్వబడవలెను. బాప్తిస్మమిచ్చు యోహాను పరిచర్యలో, ప్రజలందరు మారుమనస్సు నొందుచు రాజ్యము నిమిత్తము సిద్ధపడవలెనని వారిని ఆహ్వానించుచుండినప్పుడు, బాప్తిస్మము (నీటిలో ముంచడము పద్ధతి చొప్పున) ఒక ముఖ్యమైన భాగమై యుండినది (3:6పై గల వ్యాఖ్యానము చూడు). యేసు తానే బాప్తిస్మము పొందిన తరువాత, ఆయన పరిచర్య యోహాను పరిచర్యను మించినదై యుండినది: "యోహాను కంటె యేసు ఎక్కువ మందిని శిష్యులనుగా చేసికొని వారికి బాప్తిస్మమిచ్చుచుండెను (అయినను యేసే బాప్తిస్మమియ్యలేదు, గాని ఆయన శిష్యులిచ్చుచుండిరి)" (యోహాను 4:1, 2). వారు శిష్యులనుగా చేయు ప్రక్రియలో ప్రజలకు బాప్తిస్మమియ్యవలెనని యేసు తన అపొస్తలులకిచ్చిన ఆజ్ఞ ఆయన శ్రోతలకు గొప్ప అశ్చర్యమును కలిగించునదై యుండదు.

యేసు ఇచ్చిన గొప్ప ఆజ్ఞకు సంబంధించిన బాప్తిస్మము, యోహాను మరియు యేసు శిష్యులు అంతకు మునుపు ఆచరించిన బాప్తిస్మమునకు భిన్నమైనదై యుండినది. ఆ నాటి నుంచి, సిలువపై మరణించి మృతులలో నుండి తిరిగి లేవడము కూడ జరిగిపోయాయి. అపొస్తలులు మొదటి సంపూర్ణ సువార్త ప్రకటించి యేసు ఇచ్చిన గొప్ప ఆజ్ఞ ప్రకారమైన బాప్తిస్మము పద్ధతిని అవలంబించుచుండినప్పుడు, రాజ్యము (సంఘము) నెలకొల్పబడినది (అపొస్తలుల కార్యములు 2).

సిలువమరణము నొంది పునరుత్థానుడైన ప్రభువు గూర్చి ఉపదేశింపబడిన తదుపరి విశ్వసించినవాడెవడైనను బాప్తిస్మము పొంద నర్హుడే. వాడు మొదట మారుమనస్సు నొందవలెను, లేక తన పాపములను త్యజించి దేవుని యొద్దకు రావలెను (లూకా 13:3, 5; అపొస్తలుల కార్యములు 2:38). అతడు మారుమనస్సు నొందిన తరువాత, క్రీస్తు దేవుని కుమారుడై యున్నాడను విశ్వాసమును ఒప్పుకొనవలెను (అపొస్తలుల కార్యములు 8:37;

రోమీయులకు 10:9, 10). విశ్వాస సంబంధమైన చివరి చర్యగా, అతడు బాప్తిస్మము పొందవలెను (అపొస్తలుల కార్యములు 2:38).

బాప్తిస్మము "పాపక్షమాపణ నిమిత్తమైనదని" రూఢిపర్చుకొనవలెను (అపొస్తలుల కార్యములు 2:38), ఏలయనగా వినయపూర్వకముగా లోబడు ఈ చర్య ద్వారా, ఒకడు క్రీస్తు యొక్క త్యాగపూరితమైన మరణములో గల ఆశీర్వాదములను పొందును. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడునని" యేసు సెలవిచ్చాడు (మార్కు 16:16) ఒకని రక్షణకు బాప్తిస్మము పూర్వాకాంక్షితమైన విషయమై యున్నదని స్పష్టముగా తెలియుచున్నది. బాప్తిస్మము ద్వారా, ఒకడు క్రీస్తు లోనికి (రోమీయులకు 6:3, 4) మరియు సంఘము లోనికి (1 కొరింథీయులకు 12:13) ప్రవేశించి పరిశుద్ధాత్మ వరము పొందును (అపొస్తలుల కార్యములు 2:38).

యేసు ఇచ్చిన గొప్ప ఆజ్ఞకు సంబందించిన బాప్తిస్మము **తండ్రి మరియు కుమారుడు మరియు పరిశుద్ధాత్మ నామములో** ఇవ్వబడవలెను. ఈ పదము త్రిత్వము యొక్క సంక్షిప్తమైన వర్ణనయై యున్నది (3:17పైగల వ్యాఖ్యానము చూడు). "నామము" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*onoma*) ఏక వచనములో ఉన్నది, అది దేవుని ఏకత్వమును సూచించుచున్నది. త్రిత్వములోని ముగ్గురు వ్యక్తులు తండ్రి, కుమారుడు, మరియు పరిశుద్ధాత్మయై యున్నారు (1 కొరింథీయులకు 12:4–7; 2 కొరింథీయులకు 13:14; ఎఫెసీయులకు 4:4–6; 1 పేతురు 1:1, 2; యూదా 20, 21 చూడు).

ఈ పదజాలము గూర్చిన సాధారణ అభిప్రాయము స్పష్టమగా ఉన్నప్పటికిని, ఖచ్చితమైన అర్థము చర్చనీయాంశమై యున్నది. బాప్తిస్మము పొందువానికి ఇది అనివార్యముగా ఉపదేశించబడవలసిన ఒక సూత్రమై యుండవలెనా? ఇది సముచితమైన అభ్యాసమై యున్నది, అయితే అపొస్తలుల కార్యముల గ్రంథంలో పేర్కొనబడినట్లు క్రైస్తవులైనవారు "యేసు క్రీస్తు నామమున" (అపొస్తలుల కార్యములు 2:38; 10:48) లేదా "ప్రభువైన యేసు నామమున" బాప్తిస్మము పొందారు (అపొస్తలుల కార్యములు 8:16; 19:5).

ఈ హేతువునుబట్టి, ఈ పదజాలము సామాన్యముగా బాప్తిస్మమిచ్చుటలో గల అధికారమును సూచించుచున్నది. "నామమున" అనగా, "అధికారముతో" అని అర్థము. దైవత్వములో అనైక్యము అనునది అసలే లేదు గనుక, గొప్ప ఆజ్ఞకును అపొస్తలుల కార్యముల గ్రంథంలోని చారిత్రాత్మక వృత్తాంతములకును మధ్య పరస్పర విరుధము లేదు.

"లో" అని అనువదింపబడిన గ్రీకు ఉపసర్గము (*eis*) "లోనికి" అను అర్థమిచ్చును. "నామము లోనికి" అను పదజాలము త్రియేక దేవుని సొత్తైపోవుటను సూచించును. ఈ సందర్భములో, ఈ పదజాలములో, ఈ పదజాలము విశ్వాసి దేవుని యెడల ప్రదర్శించు నూతన స్వామిభక్తికిని, దేవునితో గల సంబంధమునకును సంబంధించినదై యున్నది.

## నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి (28:20)

**20నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి ...**

**వచనము 20.** బాప్తిస్మమును ఒక నూతన ప్రారంభముగా పరిగణించవలెను, ముగింపుగా కాదు నూతన శిష్యులు **నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని** వారికి బోధించవలెనని యేసు అపొస్తలులకు సెలవిచ్చాడు. యేసు తన శిష్యులకు లెక్కలేనన్ని ప్రాముఖ్యమైన సత్యములను ఉపదేశించుచు, దాదాపు మూడు సంవత్సరముల కాలములో వారికి ఆదేశములిచ్చుచుండెను. ఆయన ఆరోహణమైన తరువాత, వారికి బోధించుటకును, వారిని సర్వసత్యము లోనికి నడిపించుటకును, ఆయన వారి కొరకు పరిశుద్ధాత్మను పంపించును (యోహాను 14:26; 15:26, 27; 16:12–15). యేసు వారికిచ్చిన గొప్ప ఆజ్ఞ పట్ల అపొస్తలులు ప్రదర్శించు విశ్వసనీయత, మరియు అనేకులను నూతన శిష్యులనుగా చేయుట, అపొస్తలుల కార్యముల గ్రంథంలో గ్రంథస్థం చేయబడి యున్నది: "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టెవిరుచుటయందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి (అపొస్తలుల కార్యములు 2:42)

**నేనుసదాకాలము మీతో కూడ ఉన్నాను (28:20)**

[20]... **ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను**

**వచనము 20.** ఆయన వారితో కూడ నిలిచియుండు వాగ్దానముతో యేసు తన గొప్ప ఆజ్ఞను ముగించాడు: **ఇదిగో, నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను.** క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు క్రైస్తవ యుగము ముగియును మరియు పరలోకమందు నిత్యజీవము ప్రారంభమగును. అప్పటి వరకు, యేసు తన పనిని కొనసగించుచున్న తన శిష్యులతో కూడ ఉండును. మత్తయి 1:23లో, శిశువైన యేసుకు "ఇమ్మానుయేలు" అను నామము ఇవ్వబడినదన. యేసు, ఏలుబడి చేయుచున్న ప్రభువుగా, ఆయన శిష్యులకు, సరిగ్గా "ఇమ్మానుయేలు" సూచించుచున్నట్లే "దేవుడు మనకు తోడు"గా ఉన్నాడు.[5]

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

**గొప్ప ఆజ్ఞ యొక్క గొప్పతనము (28:18–20)**

మన ప్రభువైన యేసు క్రీస్తు మనకిచ్చిన తన గొప్ప ఆజ్ఞ మత్తయి 28:18–20లో కలదు. అది "గొప్ప" ఆజ్ఞ అని పిలువబడుచున్నది ఏలయనగా ఇంతటి ప్రాముఖ్యమైన ప్రకటనను ఏ మానవుడు ఎన్నడైనను చేయలేదు అది ఎప్పుడైనా మానవ మాటల్లో వ్యక్తము చేయబడిన లేదా మర్త్యుడైన మానవునికి ఇవ్వబడిన అత్యంత పవిత్రమైన అప్పగింతయై యున్నదని ప్రజలు ఈ ఆజ్ఞను వర్ణించాడు. ఈ గొప్ప ఆజ్ఞ కనీసము ఆరు కారణములనుబట్టి "గొప్పదై" యున్నది: (1) దాని వెనుక గొప్ప ప్రణాళిక ఉన్నది (ఎఫెసీయులకు 3:8–11), (2) దాని వెనుక గొప్ప అధికారమున్నది (7:29; 28:18), (3) దానికి సార్వత్రిక స్వభావమున్నది (28:19; అపొస్తలుల కార్యములు 26:16–18), (4) సమస్త మానవులను ఒక్క చోట సమావేశపర్చుటకై దానికి శక్తి కలదు (ఎఫెసీయులకు 2:13–19; 4:4–6),

(5) అది స్థిరమైనదై యున్నది (28:20), మరియు (6) ఆత్మ అత్యంత ప్రాశస్త్యమైనదని అది ఉద్ఘాటించుచున్నది (16:26).

## గొప్ప ఆజ్ఞ (28:18–20)

ఆయన పరలోకమందున్న తన తండ్రి యొద్దకు తిరిగి వెళ్లక మునుపు, యేసు ముగించవలసి యుండిన ఒక ముఖ్య కార్యము మిగిలిపోయింది: ఇహమందు ఆయన పనిని కొనసాగించు బాధ్యతను అప్పగించుట. వీడ్కోలు అప్పగింత, తరుచుగా "గొప్ప ఆజ్ఞ" అనిపిలువబడినది, మొదట అపొస్తలులకు ఇవ్వబడినది; కానీ అది "యుగ సమాప్తి వరకు" ఆయన సంఘమునకు ఉద్దేశింపబడినదై యున్నది (28:20). ఈ సందేశమునకు సంబంధించిన సంపూర్ణ సమాచారము ఒక్క చోట ఇవ్వబడలేదు. సంబంధిత నానా భాగములను యేసు ఆయన పునరుత్థానమయ్యింది మొదలుకొని పరమునకు చేర్చుకొనబడిన కాలములో, అనగా నలువది దినముల వ్యవధిలో వెవ్వేరు సమయములలో ఇచ్చాడు. ఈ ఆజ్ఞకు సంబంధించిన సంపూర్ణ సమాచారము కొరకు, మనము పరిశుద్ధాత్మ సమకూర్చిన ఆ యా వృత్తాంతములను ఒక్క చోట కూర్చుకొనవలెను (28:18–20; మార్కు 16:15, 16; లూకా 24:46–49).

---

సూచనలు

[1]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 412. [2]ఈ మాటలను పరిమితమైన ఆజ్ఞతో పోల్చి చూడు: "వెళ్లుడి. వెళ్లుచు ... ప్రకటించుడి" (10:6, 7). [3]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 746, n. 30. [4]France, 414. [5]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 268.

## సారాంశము

మత్తయి వ్రాసిన సువార్త గూర్చి మనము చేసిన అధ్యయనము జీవితమునకు సంబంధించిన సముచితమైన సమాధానములను తెలిసికొనునట్లు మనకు సహాయకరముగా ఉండినది.

*రాజు ఎవరు, మరియు ఆయన ఎందుకు వచ్చాడు?* దేవుని కుమారుడు మనకు రక్షణను ఇచ్చుటకు ఇహమున కేతెంచాడు! ఎంతో కాలంగా ఎదురుచూడబడిన మెస్సీయ కన్యక గర్భమున జన్మించాడు, పాపరహితమైన జీవితము జీవించాడు, సిలువమరణము నొందాడు, మరియు మృతులలో నుండి తిరిగి లేచాడు! ఇహమును వీడక మునుపు, రానైయున్న ఆయన రాజ్యము కొరకైన పునాదిని వేసాడు. ఈ రాజ్యము ఆయన పునరుత్థానుడైన పిదప వచ్చిన తొలి పెంతుకొస్తు దినాన ఉద్భవించినది.

*తరువాత జరుగునదేమిటి?* యేసు మరలా వచ్చును, అప్పుడు అంత్య తీర్పు తీర్చబడును. ఆ దినము కొరకు మనము సిద్ధపడినవారమై ఆ రోజు కొరకు సిద్ధంగా ఉండవలెనని యేసు కోరుచున్నాడు! మనము యేసు క్రీస్తు అనుచరులమై క్రొత్త నిబంధనలో గల ఆయన ఉపదేశముల ప్రకారము జీవించుచున్నవారమై యుండవలసి యున్నది.